
క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదబయలు: మండలంలోని పెదబయలు ఉప విద్యుత్ కేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పాడేరు ఈఈ పి.వేణుగోపాల్ తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలోని పెదబయలు ఉప విద్యుత్ కేంద్రంలో నూతన బ్రేకర్ అమర్చడం జరుగుతుందని, ఈ మేరకు అన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు.విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

సొసైటీ చైర్మన్‌గా హరిబాబు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న బూర్లె హరిబాబు

అడ్డతీగల: అడ్డతీగల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) చైర్మన్‌గా బూర్లె హరిబాబు గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం రైతుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. రైతులకు వ్యవసాయ పరంగా, రుణ సదుపాయం కల్పించడంతో పాటు వివిధ మార్గాల్లో వారికి వెన్నుదన్నుగా నిలుస్తామన్నారు. నాయకులు స్వప్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ మంగా బొజ్జయ్య

రంపచోడవరం: మండల కేంద్రంలోని ఎస్టీ ఆర్ కాలనీ, పెద్దగొట్టాలరేవు, ఫారెస్టు చెక్ ఏరియా సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ మంగా బొజ్జయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. సీసీ రోడ్లును నాణ్యతతో నిర్మించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉప సర్పంచ్ వీఎం కన్నబాబు, వార్డు సభ్యులు చింతల శ్యామల, చోళ్ల గౌరమ్మ, కార్యదర్శి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీకి ఏఎస్‌ఐగా పదోన్నతి



నాగేశ్వరరావు

జి.మాడుగుల: స్థానిక సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.నాగేశ్వరరావు ఏఎస్‌ఐగా పదోన్నతి పొందారు. గత కొంత కాలంగా ఆయన ఇక్కడ హెచ్‌సీగా పనిచేస్తున్నారు. ఆయనకు పదొన్నతి కల్పించి ఇదే పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్‌శాఖ కృషి చేస్తుందన్నారు. ఏఎస్‌ఐ నాగేశ్వరరావును స్థానిక ఎస్‌ఐ షణ్ముఖరావు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ కట్టడాలు తొలగించాలి



తహసీల్దార్ హుస్సేన్‌ను సన్మానిస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

చింతూరు: మండలంలోని అక్రమ కట్టడాలను తొలగించాలని ఆదివాసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జేఏసీ డివిజన్ అధ్యక్షుడు జల్లి నరేష్ ఆధ్వర్యంలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ హుస్సేన్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, బినామీ పేర్లతో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. జేఏసీ నాయకులు సీతారామయ్య, శ్రీను, సాయిబాబు తదితరులున్నారు.

మండల సమావేశం రేపు

రాజవొమ్మంగి: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఎంపీడీవో కోరారు. ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆహ్వానించారు.

ఎండుతున్న పొలాలు.. రైతుల దిగాలు



కింద్రకాలనీ గ్రామానికి చెందిన పోతురాజుబాబు మెట్ట చెరువుకు పడిన గండి

- రెండేళ్లుగా మరమ్మతుకు నోచుకోని పోతురాజుబాబు చెరువు
- సాగునీరందక అవస్థలు
- బీడుగా మారుతున్న పైరు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు

రాజవొమ్మంగి: సాగు నీరు లేక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పాడైన సాగునీటి చెరువులను మరమ్మతు చేయక పోవడంతో నీరందక పొలాలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. మండల కేంద్రానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో లోతట్టున, పెద్దేరు వాగు అవల వైపు కింద్ర గ్రామం ఉంది. ఈ గ్రామంలో గిరిజనులకు వ్యవసాయమే ప్రధాన ఆధారం. గ్రామానికి పోతురాజుమెట్ట చెరువు ద్వారా సాగునీరు అందేది. ఈ చెరువు ప్రధాన గట్టుకు గండిపడడంతో చుక్కనీరు గ్రామానికి రావడం లేదని నీరంతా వృథాగా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్లూయిజ్, షట్టర్ వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో సాగునీరు ప్రశ్నార్థకంగా మారిందని వాపోతున్నారు. ఇటు వర్షాలు కురవక, అటు ఉన్న సాగునీటి వనరులు అక్కరకు రాక సాగు అంటేనే భయం వేస్తోందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది తిండిగింజలు పండించుకోవడం కూడా గగనంగా మారిందని వాపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

పోతురాజుమెట్ట చెరువుకు తరచూ గండి పడుతుండడంతో శ్రమదానంతో పలుమార్లు పూడ్చుకున్నప్పటికీ భారీ వర్షాలు, వరదలకు మరలా సమస్య ఉత్పన్నమవుతుందని స్థానిక రైతులు చెబుతున్నారు. సమస్యపై రంపచోడవరం గ్రీవెన్స్‌లో పలుమార్లు అధికారులకు వినతులిచ్చిన కనీసం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి పథకాలను పర్యవేక్షించాల్సిన ప్రత్యేకాధికారులు కన్నెత్తి చూడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిన్నతరహా సాగునీటి పథకం ద్వారా గ్రామానికి చెందిన సుమారు 300 ఎకరాలకు సాగు నీరు అందేదని, గండి పూడ్చకపోవడంతో ఆకయట్టు భూములు బీడు వారాయని రైతులు వాపోతున్నారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణం గల చెరువు గర్భం పిచ్చిమొక్కలు బలిసి అడవిని తలపిస్తోందని చెబుతున్నారు.

అక్కరకు రాని ఎత్తిపోతల పథకం

కింద్ర గ్రామానికి మరో ప్రధాన ఆధారమైన సాగు నీటి వనరు ఎత్తిపోతల పథకం కూడా సక్రమంగా పని చేయడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి గల మూడు మోటార్లలో ఒక్కటి మాత్రమే అంతంత మాత్రంగా పని చేస్తోందన్నారు. దీంతో పూర్తిస్థాయిలో సాగునీరందడం లేదంటున్నారు.ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకోవడంతో సాగు ప్రశ్నార్థకంగా మారిందంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నార.



మెట్టు గరువులో ఎండిపోయిన చోడి పంట

వర్షాభావంతో ఎండిపోతున్న చోడి పంట

అరకులోయటౌన్: ఈ ఏడాది ఖరీఫ్‌లో చోడి పంట వేసిన గిరిరైతులు లబోదిబో మంటున్నారు. చోడి నాట్లు వేసి 10 గడుస్తున్నా వర్షాలు కురవకపోవడం, ఎండలు తీవ్రత అధికంగా ఉండడంతో నాట్లువేసిన చోడి పంట ఎండిపోయాయి. దీంతో దిక్కుతోచని పరిస్థితిలో రైతులున్నారు. ఎంతో వ్యవ, ప్రయాసాలతో వేసిన పంట కళ్లముందు ఎండిపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. వర్షాధారంపై ఆధారపడి పండించే చోడి పంట నాట్లు వేసిన రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురవకపోతే భూమిలో తేమ లేకపోతే పంట ఎండిపోయి ఎందుకు పనికి రాకుండా పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. చోడి పంటకు ఎటువంటి బీమా లేకపోవడంతో తీవ్ర నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో చోడి నాట్లు వేసేందుకు ఎదురు చూసిన గిరిరైతులు అదును చూసి వర్షాలు తగ్గగానే జోరుగా నాట్లు వేశారు. నాట్లు వేసిన రోజు నుంచి వర్షాలు కురవలేదు. అరకులోయ వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో గత పది రోజుల క్రితం వేసిన చోడి పంట సుమారుగా 4వేల ఎకరాలకు పైగా ఉంటుందని అధికారుల అంచనా.

ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామం అధికారుల లిస్టులో లేదు. సాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామంలోని పోతురాజుబాబు మెట్ట చెరువు గండ్లు పూడ్చాలని ఐటీడీఏకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చాము. చెరవు మరమ్మతుకు నిధులు మంజూరైనట్టు అధికారులు ప్రకటించడంతో సొంత సొమ్ముతో రైతులంతా కలిసి గండి పూడ్చాం. తరువాత బిల్లులు మంజూరు చేయలేదు. దీంతో తీరని అన్యాయం జరిగింది. భారీ వర్షంతో మరోసారి పెద్దగండి పడడంతో నీరంతా వృథాగా పోతోంది. – గంజా నాగరాజు, పీసా గ్రామ కమిటీ చైర్మన్, కింద్ర

పంట ఎండిపోయింది



సుమారు ఒక ఎకరం విస్తీర్ణంలో చోడి నాట్లు వేసి పది రోజులు గడిచినా వర్షాలు కురవక పోవడంతో పంట పూర్తిగా ఎండిపోయింది. నారుమడి సిద్ధం చేసే నాట్లు వేసే వరకు ఎంతో కష్టబడి, కూలీలకు పెట్టుబడి పెట్టాను. ఇప్పుడు ఎంత వర్షం కురిసినా ఫలితం లేదు. ఈ ఏడాది చోడి పంట వల్ల నష్టపోయాను. – పదాల విశ్వనాథ్, గిరిరైతు, బోసుబెడ, అరకులోయ

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ





ముంచంగిపుట్టు, జి.మాడుగుల తహసీల్దార్లుగా బాధ్యతలు స్వీకరిస్తున్న శంకర్‌రావు, రాజ్‌కుమార్



అనంతగిరి తహసీల్దార్ వీరభద్రచారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది



చింతపల్లి తహసీల్దార్ ఆనందరావును అభినందిస్తున్న డిటీ చంద్రశేఖర్, సిబ్బంది

అనంతగిరి(అరకులోయ): మండల తహసీల్దార్‌గా వీరభద్రచారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి కలక్టరేట్‌లో లీగల్ సెల్ డీటీగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడ తహసీల్దార్‌గా వచ్చారు. గత కొన్నేళ్లుగా ఇక్కడ డిటీగా పనిచేసిన మాణిక్యం ఎఫ్ఏసీ ఎంఆర్‌వోగా పనిచేసేవారు. తహసీల్దార్ బాధ్యతలు తీసుకున్న వీరభద్రచారికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలకు సేవచేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డీటీ మాణిక్యం, ఆర్ఐ జగ్గయ్యమ్మ, సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా శంకర్‌రావు

ముంచంగిపుట్టు: మండల తహసీల్దార్‌గా కె.శంకర్ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఆర్.వి.ఎస్.నర్సమ్మ రిటైర్డ్ అయ్యారు. దీంతో అనకాపల్లి జిల్లా రోలుగుంట మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న శంకర్‌రావును పదోన్నతి కల్పిస్తూ ముంచంగిపుట్టు తహసీల్దార్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఆయనకు ఆర్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది రవి కుమార్, భూపతి పడాల్, మత్స్యరాజు, రమేష్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

తహసీల్దార్‌గా ఆనందరావు

చింతపల్లి: చింతపల్లి మండల తహసీల్దార్‌గా జి.ఆనందరావు నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వహిసున్న రవికుమార్‌కు బదిలీ కావడంతో రెండు నెలలు నుంచి గూడెం కొత్తవీధి తహసీల్దారు రామకృష్ణ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం ఇటీవల బదిలీల్లో భాగంగా రావికమతం మండలం డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఆనందరావుకు తహసీల్దారుగా పదోన్నతి కల్పిస్తూ చింతపల్లి బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డీటీలు చంద్రశేఖర్, బాలుదొర, ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్‌వోలు, తదితరులు అభినందనలు తెలిపారు.

తహసీల్దార్‌గా రాజ్‌కుమార్

జి.మాడుగుల: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసి తహసీల్దార్‌గా పదోన్నతి పొందిన జి.రాజ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. రెవెన్యూపరమైన సమస్యలు, తహసీల్దార్ కార్యాలయంలో పరిధిలో గల ప్రజా సమస్యలు, ఇబ్బందులు తమ దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

తహసీల్దార్‌గా అన్నాజీరావు

గూడెంకొత్తవీధి: మండల తహసీల్దార్‌గా హెచ్.అన్నాజీరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన రామకృష్ణకు మరో ప్రాంతానికి బదిలీ అయింది. బాధ్యతలు స్వీకరించిన అన్నాజీరావు కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడి తహసీల్దార్‌గా వచ్చారు. ఈయన గతంలో నక్కపల్లి, కోటవురట్లలో డీటీగా బాధ్యతలు నిర్వహించారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ సీతారామ్, రీసర్వే డీటీ దుమంతి సత్యనారాయణ, వీఆర్‌వోలు ఆయనకు స్వాగతం పలికారు. బదిలీపై ఇక్కడ నుంచి వెళ్తున్న తహశీల్దార్ రామకృష్ణను సిబ్బంది సన్మానించారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు.

ఫసల్ బీమాపై అవగాహన



రైతులకు పీఎం ఫసల్ భీమా పథకంపై అవగాహన కల్పిస్తున్న శరణ్య మాధురి

పెదబయలు: మండలంలోని 23 పంచాయతీల్లో పసుపు రైతులు పీఎం ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యానశాఖ అధికారి శరణ్య మాధురి తెలిపారు. మండలంలోని గలగండ గ్రామంలో పసుపు రైతులకు ఆమె బుధవారం అవగాహన కల్పించారు. మండలంలో పసుపు పండించే రైతులు ఎకరానికి రూ.1,336 ప్రీమియం చెల్లిస్తే ఈ పథకం కింద పంట దిగుబడి తగ్గిపోయినా, ప్రకృతి వైపరీత్యాలు సంభవించడం వల్ల నష్టపోయిన రైతులకు పరిహారంగా రూ.89,069 వరకు బీమా వర్తిస్తుందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో గ్రామ ఉద్యాన సహాయకులు, గ్రామ వ్యవసాయ అధికారికి సంప్రదించి ఈ నెల 31 లోగా రైతులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.మండలంలోని ప్రతీ రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కల్వర్టును బాగు చేయండి



కుమ్మరివీధిలో కోతకు గురైన కల్వర్టును పరిశీలిస్తున్న జెడ్పీటీసీ బొంజుబాబు, నాయకులు

పెదబయలు: మండలంలోని గోమంగి పంచాయతీ సరియాపల్లి, కుమ్మరివీధి గ్రామాల మధ్యలో కోతకు గురైన కల్వర్టును జెడ్పీటీసీ సభ్యులు కూడ బొంజుబాబు గురువారం పరిశీలించారు. ఏడాదిగా కల్వర్టు పాడైందని ఇటీవల వర్షాలకు మరింతగా కోతకు గురైయిందని. దీంతో పెద్ద వాహనాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. పాడేరుకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గమన్నారు. ఈ దారి మీదుగా గోమంగి, గుల్లేలు, పోయిపల్లి, గిన్నెలకోట, ఇంజరి. లింగేటి, బొంగరం, కుంతుర్ల గ్రామస్తులతో పాటు జి. మాడుగుల మండలాల సరిహద్దు పంచాయతీ వాసులకు ఇదే రోడ్డు మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్తుంటారని చెప్పారు. ఈ మార్గంలో ఉన్న కల్వర్టు కోతకు గురువడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాది గడుస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి, ఈ స్థానంలో నూతన కల్వర్టు నిర్మించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మ బాలరాజు,నరేష్, బొంజుబాబు, యువరాజు, ప్రసాద్, సీపీఐ నాయకుడు రాధాకృష్ణ తదితరులున్నారు.

విద్యార్థులకు ఆధార్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

చింతపల్లి: పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరికీ ఆధార్‌కార్డులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. మండలంలోని కుడుముసారి పంచాయతీలో గురువారం పర్యటించారు. మండలంలోని కోటగున్నలు, నిమ్మపాడు, కుడుముసారి గ్రామాల్లోని పాఠశాలలను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కేంద్రంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలో తల్లికి వందనం ఎంత మందికి ఏఏ కారణాల వలన నిలిచిందో అడిగి తెలుసుకున్నారు. జనన, మరణ ధ్రువపత్రాలను మంజూరుకు సంబంధించి వివరించారు. విస్తృతంగా క్లోరినేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు. సర్పంచ్ కోటేశ్వరరావు, మాజీ ఎంపీటీసి భాస్కర రావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

రంపచోడవరం: గిరిజనుల ఆరాధ్య దేవత గడి బాపనమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం పురస్కరించుకొని బోనాలు మహోత్సవం బుధవారం నిర్వహించారు. ఆలయ అధికారి సత్య రమేష్ ఆధ్వర్యంలో అర్చకులు బత్తిన రామకోటేశ్వరరావు నిర్వహించారు. రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి, ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి సతీమణి రాణి తదితరులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పండుదొర

జి.మాడుగుల: మండలంలో పెదలువ్వాసింగి పంచాయతీ సంగులోయ గ్రామంలో జెడ్పీ నిధులతో మంజూరైన బోరుబావి నిర్మాణ పనులను వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండపల్లి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గబ్బాడి పండుదొర గురువారం ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సమస్యను అధికారులు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి దృష్టికి తీసుకెళ్లడంతో జెడ్పీ నిధులు మంజూరైనట్టు వారు చెప్పారు. ఈ బోరుబావి నిర్మాణంతో గ్రామంలో నీటి సమస్య పరిష్కారమైందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పెదబాలన్న, సన్యాసమ్మ, వార్డు సభ్యుడు చింటిబాబు, పీసా కమిటీ సభ్యుడు మత్స్యలింగం, సంగులోయ, వంచేబు గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత ఫలితాలు



విద్యార్థులకు స్టడి మెటీరియల్‌ను అందజేస్తున్న సర్పంచ్ త్రినాథ్

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ దాబుగూడ ఎంపీపీ పాఠశాలను సర్పంచ్ త్రినాథ్ గురువారం సందర్శించారు. విద్యార్థులకు బుక్స్, స్టడీ మెటిరియలు, గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని, ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. క్రమ శిక్షణతో చదివితే ఉన్నత ఫలితాలు పొందవచ్చన్నారు. విద్యార్థులు పాఠశాలల్లో సౌకర్యాలు వినియోగించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు రంజిత్‌కుమార్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు సుందర్‌రావు, నీలకంఠం, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

22న మండల సమావేశం

ముంచంగిపుట్టు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 22న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వి.సూర్య నారాయణమూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన మంగళవారం ఉదయం 11గంటలకు సర్వసభ్య సమావేశం జరుగుతుందని, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని, అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో విధిగా హాజరుకావాలన్నారు. గైర్హాజరైన అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

స్వీయరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రైనీ ఎస్ఐ అంజలి

రాజవొమ్మంగి: జడ్డంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను ట్రైనీ ఎస్ఐ అంజలి గురువారం సందర్శించారు. గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఎదురయ్యే చేదు అనుభవాలను వెంటనే తల్లిదండ్రులతో పంచుకోవాలని సూచించారు. ఆడపిల్లలు తగిన జాగ్రత్తలతో, ఆత్మస్థైర్యంతో మెలగాలన్నారు. స్వీయరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జడ్డంగి ఎస్ఐ చినబాబు. మహిళా పోలీస్ లత, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న గిరిజన మహిళా సంఘం నాయకురాలు హైమావతి

హుకుంపేట: మండలంలోని గడ్డిమర్రి గ్రామంలో చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందిన చిన్నారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, రూ.10లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని గిరిజన మహిళ సంఘం జిల్లా కార్యదర్శి సొంటేన హైమావతి డిమాండ్ చేశారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ గడ్డిమర్రి గ్రామానికి చెందిన చిన్నారులు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మృతి చెందడం బాధాకరమని తమ కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకొవడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో ఉన్న చెరువులను రక్షణ ఏర్పాటు చేయాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. సంఘం గౌరవ అధ్యక్షురాలు వి.విజయ, అధ్యక్షురాలు కౌశల్య తదితరులున్నారు.